క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అక్కన్నఅగ్రహారంలో ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. రేగిడి మండల ఇందూ జ్ఞానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతంపై ప్రచార పుస్తకాలు పంపిణీ చేశారు. ముక్తికి మార్గం భగవద్గీత పఠనమన్నారు. కార్యక్రమంలో రేగిడితో పాటు రాజాం, సంతకవిటి, వంగర మండలాలకు చెందిన జ్ఞానవిజ్ఞాన వేదిక భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



జనార్దనదొరను పరామర్శిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

రాజాం: పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఇనుగంటి జనార్దన దొరను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. పట్టణంలోని శాణావీధిలో దొర నివాసానికి చేరుకుని ఇటీవల మృతిచెందిన అతని భార్య జ్యోతిదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, తోట తిరుమలరావు, పాలవలస శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ



ర్యాలీలో బొబ్బిలి ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు, మతవిశ్వాసులు

బొబ్బిలి: మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక పాతకోర్టు వద్ద బొబ్బిలి ఆర్‌సీఎం సంఘ సభ్యులు ఆదివారం శాంతియుత ర్యాలీ, మానవహారం చేపట్టారు. లౌకిక భారతదేశంలో అన్ని మతాల వారు సమానమేనని, క్రిస్టియన్లపై దాడులు తగవన్నారు. కార్యక్రమంలో ఫాదర్ మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా నూతన భవనాల నిర్మాణం



నూతనంగా నిర్మిస్తున్న కేజీబీవీ భవనాలు

రాజాం: మండలంలో గురవాం గ్రామం వద్ద ప్రభుత్వ కేజీబీవీ పాఠశాల నూతన భవన నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.1.60 కోట్లతో జూనియర్ కళాశాల భవనాలను నిర్మిస్తున్నట్లు ఏఈ జగదీష్ వెల్లడించారు. మరో రెండు నెలలో పనులు పూర్తిచేసి, భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నాడు–నేడు నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



మాధవబజార్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

రాజాం: పట్టణంలో అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాజాం మున్సిపల్ కార్యాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ అన్నారు. ఆదివారం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో మురుగుకాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

ఆర్‌బీకేలో అందుబాటులో యూరియా



రేగిడి ఆర్‌బీకేకు చేరుకున్న యూరియా

రేగిడి: మండలంలో రైతుభరోసా కేంద్రాలకు యూరియా ఎరువులు చేరుకుంటున్నాయి. మండలంలో అన్ని ఆర్‌బీకేలకు యూనిట్‌గా తీసుకుని రైతులకు సరిపడే యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ముందుగానే ఉంచుతున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ వెల్లడించారు. రైతులు ఆర్‌బీకేలు వద్ద వీటిని కొనుగోలు చేయవచ్చని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆరో డివిజన్, సచివాలయం–8 పరిధిలో ఆదివారం పర్యటించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ స్పీకర్ ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అందుకే అందరికీ మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ మేలు జరిగేలా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేసి, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మళ్లీ సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ గడపకు వెళ్లి, ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా మహిళల ప్రగతికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని దీనికి నిదర్శనమే వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలని ఉదహరించారు. కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ గతంలోని టీడీపీ పాలనలో రోడ్లు, మంచినీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. నగరాభివృద్ధికి కృషి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని, సీఎం జగనన్నను మరోసారి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివద్ధి మండలి డైరెక్టర్ సంగం రెడ్డి బంగారునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు కృష్ణారావు, బి.అప్పారావు పాల్గొన్నారు.

అలరించిన నృత్య సంగీతార్చన



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన అష్టోత్తర శత నృత్య సంగీతార్చన అలరించింది. విశాఖకు చెందిన పరిమళ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ నృత్య కళాకారిణి, పరిమళ అకాడమీ డైరెక్టర్ లిపికారెడ్డి కూచిపూడి నృత్యం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య కళాకారిణి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 108 వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నృత్య సంగీతార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతిచోటా తమకు ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జాతీయ రెడ్డి జేఏసీ అధ్యక్షుడు ఎం.బాలబ్రహ్మారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు



అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపకుడు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో స్థానిక కనపాక, తదితర ప్రాంతాల్లో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసి, పదో తరగతి టాపర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇష్టం, కఠోర శ్రమ, అకుంఠిత దీక్షతో చదివితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. క్రమశిక్షణతో పాటు ప్రణాళికబద్ధంగా చదవాలని విద్యార్థులకు సూచించారు. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కారని, ఓ లక్ష్యంతో కష్టపడితే సమాజంలో గుర్తింపు పొందుతారన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ ఎం.మురళి మాట్లాడుతూ మంచి లక్ష్యం, దృఢ సంకల్పం ఉంటే మంచి విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా 500 మార్కులు పైబడి సాధించిన 17 మంది ు నగదు బహుమతి, ఉత్తమ ఫలితాలు సాధించిన మరో 42 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.ఎస్.రావు, రామ, మజ్జి ఆదిబాబు, సారిపల్లి అప్పారావు, పాట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కథ చెబుతారా.. ఊ.. కొడతాం'..కు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న వారితో టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ శ్యామ్‌సుందర్

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం), హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నీతికథల పోటీలకు విశేష స్పందన లభించింది. కథ చెబుతారా.. ఊ..కొడతాం.. పేరిట చేపట్టిన ఈ పోటీలకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి మొత్తం 80 మంది హాజరయ్యారు. జూనియర్ విభాగంలో 45 మంది, సీనియర్ విభాగంలో 35 మంది పోటీల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు చేపట్టామని టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని చింతలవలస, ఐదో ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం గ్రామాలతో పాటు చెల్లూరి ఇండస్ట్రియల్ ఏరియాకు సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ బదిలీలను వెనక్కి తీసుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం చేస్తున్న వాటిలో అక్రమ బదిలీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుకారీబాబు డిమాండ్ చేశారు. స్థానిక లక్కపందిరి వారి వీధిలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 117 కారణంగా ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. విద్యార్థుల ప్రవేశాలు కూడా తగ్గిపోయాయన్నారు. ఆర్థిక బకాయిలను డిసెంబరు 31వ తేదీలోగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, బి.జోగినాయుడు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- 29వ డివిజన్‌లో రూ.52 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్లు

విజయనగరం: నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పెద్దపీట వేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్ అన్నారు. స్థానిక 29వ డివిజన్ పరిధిలో దాదాపు రూ.52 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు వంటి తొమ్మిది రకాల అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ శంకుస్థాపన మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు డివిజన్‌లలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో రోడ్లు, కాలువలు, కల్వర్టులు తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 29వ డివిజన్‌లో రూ.3 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గతంలోని టీడీపీ పాలనలో కంటే ఇప్పుడు నగరం అన్ని విధాలా శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి కూడా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి జోనల్ ఇన్‌చార్జ్‌లు సంగంరెడ్డి బంగారునాయుడు, కృష్ణారావు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ నాయకులు కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులను ఉద్దేశించి, మాట్లాడుతున్న గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి సోమరాజు

విజయనగరం టౌన్: స్థానిక ఎస్.వి.ఎన్ నగర్‌లో ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయంలో బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు బ్రాహ్మణ విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో ఆదివారం సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పి.సోమరాజు మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లో కూడా రాణించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబీబీఎస్ చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పురస్కారాలతో సన్మానించినట్లు గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ తెలిపారు. అనంతరం సెంచూరియన్ వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ చిలుకూరి శాంతమ్మను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు డీవీ శ్రీకాంత్, అధ్యక్షుడు భోగరాజు బాబూజీ, కోశాధికారి మంగిపూడి శివరామయ్య, కార్యదర్శి ఇనుగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు..'నిధులతో గ్రామాల్లో సమస్యల పరిష్కారం



శ్మశానానికి సమీపంలో నిర్మించిన కల్వర్టు

సంతకవిటి: 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఓ వరం లాంటిదని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి అన్నారు. శ్రీహరినాయుడుపేట శ్మశానానికి వెళ్లాలంటే గ్రామంలోని చెరువు సప్లా నుంచి వచ్చే కాలువను దాటి వెళ్లాలి. వర్షాకాలంలో శ్మశానానికి చేరుకునేందుకు ఉన్న ఇబ్బందులను గుర్తించి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో శ్రీహరినాయుడుపేట–సంతకవిటి ప్రధాన రహదారి నుంచి శ్మశానం వరకు రోడ్డు నిర్మాణంతో పాటు కల్వర్టును నిర్మించారు. దీంతో శ్మశానవాటికకు వెళ్లే దారి సమస్య తీరిందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు మంత్రి, ఎంపీల పరామర్శ



నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యనారాయణ



నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును విశాఖ పట్టణం ఎంపీ ఎం.వి.వి సత్యనారాయణ, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మంత్రి సీదిరి అప్పలరాజు కలిసి పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నర్సింగరావు ఈ నెల 13న స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీలు విజయనగరంలోని ఆయన స్వగ్రామానికి ఆదివారం వెళ్లి, నర్సింగరావు చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రేగిడి: మండలంలో బొడ్డవలస గ్రామ సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.33,840లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

రాయితీపై స్ప్రింక్లర్ పైపులు

రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ పైపులను పంపిణీ చేస్తోందని మండల వ్యవసాయాధికారి గురుగుబెల్లి మురళీకృష్ణ తెలిపారు. వ్యవసాయానికి నీరు అందించేందుకు వీలుగా స్ప్రింక్లర్ పైపులను ఆర్‌బీకేల ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 200 ఎకరాల సాగు భూమికి ఈ స్ప్రింక్లర్ పైపులు అందించినట్లు ఏఓ వెల్లడించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 82 మంది ఎంపిక

బాడంగి: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరానికి హాజరైన భీమవరం, బాడంగి, వీరసాగరం, గొల్లాది, రామచంద్రాపురం గ్రామాల నుంచి హాజరైన 131 మంది కళ్లను తనిఖీ చేశారు. 82 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామని, త్వరలోనే వీరిని విశాఖ తీసుకువెళ్లి, ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని వైద్య శిబిరం నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్నల్ ఆడిట్‌తో అక్రమాలకు చెక్



ఆడిట్‌పై అవగాహన కల్పిస్తున్న ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి

రాజాం: డ్వాక్రా సంఘాల పుస్తకాలు ఆడిట్ చేయడం ద్వారా సంఘంలోని ప్రతీ పైసా దుర్వినియోగం కాకుండా ఉంటుందని, ప్రతీ పైసాకు లెక్క తెలుస్తుందని వైఎస్సార్ క్రాంతి పథం రాజాం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. రాజాం మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద రాజాం మండలంలోని వీఓలు, వీఓఏలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రతీ సంఘం తమ పుస్తకాలను ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం టి.దధికుమార్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సామంతుల అరుణకుమారి, సీసీలు, సీఏఫ్‌లు, వీఓలు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ అజెండా



ఆరికతోట ప్రాంత ప్రజలతో మమేకమైన వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్ర అభివృద్ధే అజెండాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని ఆరికతోటను సందర్శించిన ఆయనకు కూరాకుల కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని అక్కడి వారు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులు గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించేలా సచివాలయాలు, అన్నదాతకు అండగా ఆర్‌బీకేలు, ఆరోగ్య భద్రతకు వెల్‌నెస్ కేంద్రాలు, యువత భవితను మార్చే డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కోట్లాది రూపాయలతో పల్లె ప్రగతికి ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. ప్రజలకు సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయ సేవలు అందించేందుకు అనువుగా ఒక్కో శాఖకు కార్యాలయం నిర్వహణకు ఒక్కో అధునాతన భవనాన్ని నిర్మిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గ్రీన్ అంబాసిడర్ గౌరు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

పుస్తకాలతో విజ్ఞానం

బాడంగి: పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం అలవడుతుందని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి విచ్చేసి, కొత్త కొత్త పుస్తకాలను ఎంతో ఇష్టంతో చదివి మంచి మంచి విషయాలను గ్రహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పుస్తకాలు ఎలా చదవాలి, ఏ విధంగా అందులోని మంచి విషయాలను గ్రహించాలన్న దానిపై అవగాహన కల్పించారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి, లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతిఒక్కరూ ప్రతిరోజూ ఏదో ఒక పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలన్నారు.

అఖండ నామసంకీర్తన

రేగిడి: మండల కేంద్రం రేగిడిలో వెలసిన విశ్వసాయి మందిరంలో ఆదివారం సత్యసాయి భక్తులు అఖండ నామసంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు సాయినామ సంకీర్తనలు, భక్తిగీతాలు ఆలపించారు.